క్లుప్తంగా

వైభవంగా నిత్య హోమం

విజయవాడకల్చరల్: కంచికామకోటి పీఠపాలిత శారదా చంద్రమౌళీశ్వర, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం నాటి కార్యక్రమంలో సప్తరుషి పూజ, నిత్యహోమం, గరుడ సేవలను నిర్వహించారు. శరన్నవరాత్రుల్లో భాగంగా శారదాదేవిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవాలయ నిర్వాహకుడు డాక్టర్ ఆర్. రామ్మోహనరావు మాట్లాడుతూ.. మంగళవారం వేద సభను నిర్వహిస్తామన్నారు. మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

మధురంగా సాగిన సినీ భక్తి సంగీతం



విజయవాడకల్చరల్: శరన్నవరాత్రులు సందర్భంగా తెలుగు కళావాహిని, శ్రీకళాభారతి, కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి, బ్రహ్మానందరావు సంగీత సాహిత్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై నిర్వహించిన సినీ భక్తి సంగీతం మధురంగా సాగింది. దేవులపల్లి కృష్ణ శాస్త్రి, దాశరథి నారాయణరెడ్డి, సిరివెన్నెల సీతారామ శాస్త్రిలు రచించిన లలిత గీతాలు, తెలుగు సినిమాల్లో వచ్చిన అమ్మవారిమీద పాటలను గాయనీ గాయకులు మల్లాది స్వాతి, సుశీల్‌కుమార్, భారతి, వెంకట్, సుమలత, కామేశ్వరి ఆలపించారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు కె.డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, బ్రహ్మనందరావు, పరుచూరి విజయలక్ష్మి, మందరపు హైమావతి,పెట్ల బాలాచారి, మీరాకుమార్, బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పెట్ల సత్యవతిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

హిందీ భాష వినియోగం అవసరం

పాయకాపురం(విజయవాడరూరల్): రాజ్ భాష హిందీ భాషను ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించడం అవసరమని బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజ్‌భాష అధికార ప్రతినిధి చిరాగ్ రాజా అన్నారు. పాయకాపురం రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ విజయవాడలో హిందీ త్రైమాసిక కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమాన్ని చిరాగ్ రాజా, ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. దేశ భాష హిందీ భాషను విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హిందీ భాషా విధానాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహణ అవసరమన్నారు. సంస్థలోని అధికారులు, సిబ్బంది హిందీ భాషను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో పరిశోధన అధికారులు డాక్టర్ సవిత పి.గోపోడ్, డాక్టర్ సుజాత, పిడోకే, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ

విజయవాడకల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివ రామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ మందిరంలో సోమవారం నిర్వహించిన సంగీత కచేరీ మధురంగా సాగింది. సంగీత మూర్తిత్రయం సద్గురు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కీర్తనలను మల్లాది అనయ్య సరళ, అభిఖ్యవాణి మధురంగా ఆలపించారు. క్షేత్ర ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ గాయనీ గాయకులను అభినందించారు. క్షేత్రంలో దేవాలయ సముదాయంలోని దేవాలయాల్లో శారదాంబ వీణా శారద, బాలా త్రిపురసుందరి సరస్వతిగా, మహాలక్ష్మి శ్రీవిద్యాలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు.



గుబేల్ పేటలో పూజలు చేస్తున్న మల్లాది విష్ణు, కార్పొరేటర్ శర్వాణీమూర్తి తదితరులు



శివకామేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి వెలంపల్లి



లెనిన్ సెంటర్‌లో పూజలు చేస్తున్న సుధాస్వామి, భక్తులు



చిన్నారులకు అక్షరభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ

సరస్వతీదేవీ పాహిమాం..

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం అమ్మవార్లు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, హోమాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

– గాంధీనగర్/సత్యనారాయణపురం/మధురానగర్(విజయవాడసెంట్రల్)



దేవీనగర్‌లో శ్రీ సరస్వతీ దేవిగా



జీవీఆర్‌నగర్‌లో అమ్మవారు..



కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో..



గంగానమ్మ దేవాలయంలో..



దుర్గాపురంలో సరస్వతీదేవిగా..



కాశీవిశ్వేశ్వర ఆలయంలో సరస్వతీదేవిగా..



మధురానగర్ మెయిన్‌రోడ్డులో..



శ్రీ అంకమ్మ తల్లి శక్తిపీఠంలో..



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): దేవీ శరనవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి మూలానక్షత్రం పురస్కరించుకొని ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల దర్శనానికి వెళ్లే భక్తులకు వాటర్ ట్యాంకర్లతో కార్పెట్లపై నీళ్లు చల్లాలని అధికారులను ఆదేశించామన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన వినాయకుని గుడి, కెనాల్ రోడ్డు, సీతమ్మ వారి పాదాలు, మోడల్ గెస్ట్ హౌస్, ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలా నక్షత్రం రోజున భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్నందున హోల్డింగ్ ఏరియా నుంచి వినాయకుడి గుడి వరకు కార్పెట్లు వేసి, కార్పెట్ల పైన వాటర్ ట్యాంకర్లతో ద్వారా నీటితో తడపాలని, ప్రతి వాటర్ పాయింట్‌లో తగినంత స్టాక్ ఉండేటట్టు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ఇతర విభాగాలతో సమన్వయంతో పని చేస్తూ మోడల్ గెస్ట్ హౌస్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.



వినాయకుని గుడివద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

నయనానందకరం సాంస్కృతిక మహోత్సవం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీ నాటక అకాడమీ, విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వర రావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నయనానందకరంగా సాగుతున్నాయి. సోమవారం నాటి కార్యక్రమంలో విఖ్యాత నాట్యాచార్యుడు భాగవతుల వెంకట్రామశర్మ బృందం సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించింది. కావ్య బృందం కూచిపూడి సంప్రదాయంలో అన్నమయ్య కీర్తనలను నృత్యాలను అభినయించారు. చిప్పాడ నాగేశ్వరరావు ఘంటసాల పాటలను మధురంగా ఆలపించారు. శ్రీకాకుళానికి చెందిన సత్తిరాజు తప్పెటగుళ్ల లయబద్ధంగా వినిపించారు. పాప దొరికింది నాటకాన్ని కళాకారులు ప్రదర్శించారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శ్రీలలితా నాట్య కళాబృందం కూచిపూడి సంప్రదాయంలో నృత్యాలను ప్రదర్శించింది. సంగీత విద్వాంసుడు ఏసురాజు క్లారినెట్ వాయిద్యాన్ని, రాజీవ్ సోదరులు డప్పు అంశాన్ని ప్రదర్శించగా కళాకారులు జగదేక సుందరి సామాపౌరాణికాన్ని ప్రదర్శించారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న కావ్య బృందం

దుర్గమ్మకు నృత్య నీరాజనం



విజయవాడకల్చరల్: దేవదాయ, ధర్మదాయ శాఖ, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనకదుర్గానగర్‌లోని కళా వేదికపై ప్రదర్శిస్తున్న సంగీత, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. మూలా నక్షత్రం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో వీక్షించిన కార్యక్రమాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 11 గంటల వరకు సాగాయి. ఎన్వీ నాగయ్య తాళం భజనతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తి రంజని కార్యక్రమంలో భాగంగా ఎంఎస్ఆర్‌వీ ప్రసాద్, ఎ.సాహితీ, జి.కావ్య బృందం, హైదరాబాద్‌కు చెందిన హనుమంతరావు శివ భక్త విజయం కథన శ్రావ్యంగా వినిపించారు. వైఎస్‌వీకే సంతోష్ బృందం వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సప్పశివకుమార్ బృందం, కాకినాడుకు చెందిన కౌండిన్య, సాయి నిహారిక, పి.కల్యాణ్, బి.వెంకట్రామశర్మ, పీజీ పాత్రుడు, ఎస్.సానిక, బీటీ సుందరి, కె.సాహితీలక్ష్మి, ఎన్ఎం కౌండిన్య, ఎల్ఎం భువనేశ్వరి, హైదరాబాద్‌కు చెందిన విజయవల్లీ భువనేశ్వరి, హవిషా చౌదరి, డి.రాజేశ్వరి, కె.మనోజ్ఞలు కూచిపూడి, భరతనాట్యం సంప్రదాయంలో సెమీ క్లాసికల్ నృత్యాలను మనోహరంగా అభినయించారు. సైదా, గంగాధర్ కళాకారులకు జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమాలను రామకృష్ణ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో బాబా పుణ్యతిథి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో షిర్డీసాయినాథుని 107వ పుణ్యతిథి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం బాబావారికి క్షీరం, వట్టి వేర్లతో విశేషంగా అభిషేకం చేశారు. లోక కళ్యాణార్థం మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ సాయినాథ, దత్తాత్రేయ హోమం నిర్వహించారు. పుణ్యతిథి మహోత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉమా మాట్లాడుతూ.. బాబావారి మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ ఆంధ్రాషిర్డీగా తీర్చిదిద్దిన మందిర కమిటీ సభ్యులను అభినందించారు. బాబావారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబావారిని దర్శించుకుని, పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, లక్ష్మీసహస్రనామ పారాయణం జరిగింది. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను భక్తితన్మయత్వంలో ముంచెత్తాయి. మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, సునీత, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



హోమం నిర్వహిస్తున్న గౌతంరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే బొండా ఉమా తదితరులు

వరద ముంపులో పున్నమి ఘాట్, భవానీ ద్వీపం

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాగార్జునసాగర్, పులిచింతల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజీ వద్దకు 6 లక్షల 86 వేల క్యూసెక్కుల వరద నీరు రావడంతో బ్యారేజీకి ఉన్న 70 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో భవానీపురంలోని హరిత బెరం పార్క్‌కు వరద నీటి తాకిడి పెరిగింది. పున్నమిఘాట్, బెరంపార్క్‌లోని లాన్‌లోకి వరద నీరు వచ్చి చేరింది. విషయం తెలిసిన బెరంపార్క్ యూనిట్ మేనేజర్ శ్రీనివాస్ అప్రమత్తమై సోమవారం తెల్లవారు జామునే పున్నమి ఘాట్ నుంచి వరద నీరు మరింత లోపలకు రాకుండా సిబ్బందితో ఇసుక బస్తాలను వేయించారు. అయినా ఆగని నీటి ప్రవాహం చొచ్చుకుని వస్తూనే ఉంది. బెరంపార్క్‌లోని బోటింగ్ పాయింట్‌లోకి వరద నీరు చేరింది. ఇప్పటికే బోటింగ్ సర్వీస్‌లను నిలిపి వేసిన సంగతి తెలిసిందే. హరిత బెరంపార్క్‌లోకి పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించారు. నిన్నటి వరకు భవానీ ద్వీపాన్ని చుట్టుముట్టిన వరద నీరు ఇప్పుడు ద్వీపం లోపలకు చేరింది. దీంతో అక్కడి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. గత వరదల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సమయంలో మళ్లీ వరద రావడంతో రెండు పర్యాటక ప్రదేశాల్లో చేపట్టిన పనులన్నీ వృథా కానున్నాయి.



బోటింగ్ జెట్టీపైకి చేరిన వరద నీరు



పున్నమి ఘాట్‌లో వేసిన ఇసుక బస్తాలు

ఏకగ్రీవంగా సాంస్కృతిక సంఘం కార్యవర్గం ఎన్నిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం నూతన కార్యక్రమం ఏకగ్రీవమైంది. సాంస్కృతిక సంఘం కార్యాలయంలో ఆదివారం రాత్రి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా సామంతపూడి వెంకటేశ్వర రాజు, ఉపాధ్యక్షులుగా తిరుమలరాజు సత్యనారాయణరాజు, పీవీ సుబ్బరాజు, డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, వి.కోటంరాజు, కార్యదర్శిగా పేరేచర్ల హరిబాబు, సహాయ కార్యదర్శిగా కేఎస్ ప్రసాదరాజు, డి.భాస్కరరాజు, పి.సీతారామరాజు, కోశాధికారిగా డీజేపీఎన్ రాజు ప్రత్యేక ఆహ్వానితులుగా కె.వెంకం రాజు, కె.నర్సరాజుతో పాటు మరో 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులు సామంతపూడి వెంకటేశ్వరరాజు, పేరేచర్ల హరిబాబు కోశాధికారి డీజేపీఎన్ రాజు మాట్లాడుతూ సాంస్కృతిక సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దారులన్నీ అమ్మ సన్నిధికే..



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం అమ్మవారు శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి నుంచే అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వన్‌టౌన్ పరిసరాలు భక్తజనంతో కిటకిటలాడాయి. సాయంత్రం నిర్వహించిన ఆది దంపతుల నగరోత్సవం, కళాకారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సోమవారం రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







